
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

చిత్తూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 14 జూన్ 2024

సీఎంగా చంద్రబాబు మెగా డీఎస్సీపై చేసిన తొలి సంతకం జిల్లాలోని మూడు వేల మంది నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆశలు చిగురింపచేసింది. ల్యాండ్ టైటిలింగ్ రద్దు చేస్తూ చేసిన సంతకం అన్నదాతల్లో ఆనందం నింపింది. సామాజిక పింఛన్లను రూ.4 వేలకు పెంచుతూ చేసిన మూడో సంతకం 2.10 లక్షల మంది అవ్వాతాతలకు భరోసానిచ్చింది. అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తూ చేసిన నాలుగో సంతకం నిరాశ్రయులు, పేదల ఆకలి తీర్చనుంది. స్కిల్డ్.. అన్‌స్కిల్డ్‌ను గుర్తించేందుకని నైపుణ్య గణనకోసం చేసిన ఐదో సంతకం నిరుద్యోగుల్లో ఉపాధి అవకాశాలు పెంచనుంది. ఇలా ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలుపుకొంటూ గురువారం బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు చేసిన సంతకాలతో ఆయా వర్గాల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ చిత్తూరు సెంట్రల్

బాబు సంతకం
జన సంబరం



అభాగ్యుల కోసం మళ్లీ అన్న క్యాంటీన్లు


పలమనేరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం

మెగా డీఎస్సీతో 3 వేల మంది అభ్యర్థుల్లో చిగురించిన ఆశలు
ఇక, 2.10 లక్షల మందికి రూ.4 వేల పింఛను
పేదల ఆకలి తీర్చనున్న అన్న క్యాంటీన్లు
ల్యాండ్ టైట్లింగ్ రద్దుతో అన్నదాతల్లో ఆనందం
ఎన్నికల హామీలను నెరవేర్చుతూ సీఎం నిర్ణయాలపై అంతటా హర్షం

అన్న క్యాంటీన్లను పునరుద్ధరించడం ద్వారా అభాగ్యుల ఆకలి తీర్చనున్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక, అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదలకు రూ.5కే రుచికరమైన భోజనం వడ్డించారు. ఆయా పట్టణాల్లో ఆస్పత్రులు, బస్టాండులు.. ఇలాంటి ముఖ్య ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఆస్పత్రులకు.. తమ అవసరాల నిమిత్తం పట్టణాలకు వచ్చే పేదలు తక్కువ ఖర్చుతో కడుపు నింపుకొనేవారు. ఇంకా, ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, కూలీలు.. ఇలా స్థానికంగా ఉండే పేదలూ అన్న క్యాంటీన్లలో రూ.5కే భోజనం చేసేవారు. వీటికోసం భవనాలూ నిర్మించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే.. అన్న క్యాంటీన్లు రద్దు చేయడం ద్వారా సీఎం జగన్ పేదల కడుపుకొట్టారు. క్యాంటీన్ తిరిగి తెరవాలని టీడీపీ శ్రేణులతోపాటు, పలువురు పేదలు అధికారులకు ఎన్ని వినతులు ఇచ్చినా ఫలితం కనిపించలేదు. దీంతో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం ప్రాంతాల్లోని క్యాంటీన్లను మూసేశారు. ఈ క్రమంలో పేదల ఆకలి తీర్చేందుకు టీడీపీ నాయకులే సొంత నిధులతో చిత్తూరు, కుప్పం, జీడీనెల్లూరు, బంగారుపాళ్యం, గుడిపాల వంటి అనేక ప్రాంతాల్లో క్యాంటీన్లను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లను పునరుద్ధరించాలని తీసుకున్న నిర్ణయంతో కడుపు నిండా భోజనం చేయవచ్చని అభాగ్యుల్లో ఆశ చిగురించింది.

మెగా డీఎస్సీతో 600కుపైగా పోస్టులు

నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ లెక్కన జిల్లాకు 600కుపైగా పోస్టులు కేటాయించే అవకాశముంది. వైసీపీ హయాంలో కనీసం ఒక్క డీఎస్సీ కూడా చేపట్టకపోవడంతో జిల్లాలో సుమారు 3 వేల మంది డీఎస్సీ నిరుద్యోగులు నిరాశతో ఉన్నారు. మెగా డీఎస్సీతో వీరిలో ఉత్సాహం నెలకొంది.

డీఎస్సీలన్నీ టీడీపీ హయాంలోనే: డీఎస్సీల ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయుల భర్తీకి టీడీపీ ప్రభుత్వం గతం నుంచీ పెద్ద పీట వేస్తోంది. 1996 డీఎస్సీ మొదలుకొని వరుసగా 1998, 2000, 2001, 2002, 2003, 2004 సంవత్సరాల్లో డీఎస్సీలు నిర్వహించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2006, 2008లో డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టారు. వీటిని కూడా పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదు. మళ్లీ.. చంద్రబాబు మూడోసారి సీఎం అయ్యాక నవ్యాంధ్రలో రెండుసార్లు (2014, 2018) డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇలా టీడీపీ పాలనలో మొత్తం 9 సార్లు డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేసి రికార్డు సృష్టించారు. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా చేపట్టలేదు. 2021లో టీచర్ల సర్దుబాటు ప్రక్రియను తెరపైకి తెచ్చి 2008 డీఎస్సీలో అర్హత సాధించిన 268 మందికి, 1998 డీఎస్సీలో క్వాలిఫైడైన 614 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి 2023లో మినిమం టైం స్కేల్ కింద నియమించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో కంటి తుడుపు చర్యగా 2023, 2024 ఫిబ్రవరిలో రెండుసార్లు మాత్రమే టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు నిర్వహించి ఊరుకుండిపోయారు. ఎన్నికల ముందు డీఎస్సీని ప్రకటించారంతే.


నిరుద్యోగ ఉపాధ్యాయుల ఆశలు నెరవేర్చారంటూ పుంగనూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్, తెలుగుయువత నాయకులు

హమ్మయ్య.. భూమికి భద్రత

ప్రజల్ని భయకంపితుల్ని చేసిన ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -2022) రద్దు చేస్తూ చంద్రబాబు నాలుగో సంతకం చేశారు. వైసీపీ ప్రభుత్వం రూపొందించిన ఈ చట్టంలో పేర్కొన్న నిబంధనలు ప్రజల స్థిరాస్తుల భద్రతను ప్రశ్నార్థకం చేశాయి. సొంత ఆస్తులపై చట్టబద్ధ హక్కులను నిర్ణయించే అధికారాన్ని అధికారులకు అప్పగించి, యాజమాన్య హక్కుల కల్పన బాధ్యతల నుంచి సివిల్ కోర్టులను తప్పించడం దుమారాన్ని రేపింది. దీంతో జిల్లా ప్రజలు ఎన్నికలకు ముందు ఎటు చూసినా ఈ చట్టం గురించే చర్చించుకుని ఆందోళన చెందారు. దీనిని చంద్రబాబు రద్దు చేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

పింఛను.. పెంచెను

అవ్వాతాతలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పింఛను పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఈ మేరకు గురువారం ఆ ఫైల్‌పై సంతకం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 16 రకాల పెన్షన్‌దారులు 2,72,223 మంది ఉన్నారు. వీరిలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితర కేటగిరీవాళ్లు రూ.3 వేలు తీసుకుంటున్నారు. వీరంతా 2.10 లక్షల మంది ఉన్నారు. వీరికి వచ్చే నెల నుంచి రూ.4 వేల పెన్షన్ అందనుంది. అంటే, నెలకు రూ.2.10 కోట్ల అదనపు లబ్ధి కలగనుంది. ఈ పెంచిన పెన్షన్ ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని చంద్రబాబు చెప్పారు. అంటే, ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల పాటు పెంచిన రూ.వెయ్యి కూడా ఇవ్వనున్నారు. ఈ లెక్కన జూలై నెలలో రూ.4 వేలతో పాటు రూ.3 వేల బకాయిలు కలిపి రూ.7 వేలు అందనుంది.

గతంలోనూ పెన్షన్ పెంపు చంద్రబాబు ఘనతే

పెన్షన్ల పెంపు ఘనత ఎప్పుడూ చంద్రబాబుకే దక్కింది. 2014లో మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన, అంత వరకు రూ.200గా ఉన్న సామాజిక పెన్షన్లను 5 రెట్లు పెంచి ఏకంగా రూ.వెయ్యి చేశారు. 2019 ఎన్నికలకు ముందు దాన్ని రూ.2 వేలు చేశారు. ఆ 2019లో అధికారంలోకి వస్తే రూ.3 వేలు పెంచుతానని చంద్రబాబు అప్పటి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ఆయన ఓటమి చెందారు. 2019లో సీఎం అయిన జగన్ పింఛనును ఏడాదికి రూ.250 చొప్పున (మధ్యలో ఒక సంవత్సరం వదిలేశారు) పెంచారు. ఎన్నికలకు ముందు రూ.3 వేలు చేశారు. అదే చంద్రబాబు గెలిచి ఉంటే మొదట్లోనే రూ.మూడు వేలకు పెంచి ఉండేవారు. అదంతా నష్టపోయామని పెన్షన్‌దారులు అసంతృప్తికి లోనయ్యారు. ఇప్పుడు మొదట్లోనే రూ.4 వేలకు పింఛను పెంచడంపై వీరంతా ఆనందం వ్యక్తంచేస్తున్నారు.


పెన్షన్ల పెంపుపై పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో స్వీట్లు పంచుకుంటున్న వృద్ధులు


పిల్లల్ని బడికి తీసుకొస్తూ..


ప్రభుత్వ పాఠశాలలోకి వస్తున్న విద్యార్థినులు


పీసీఆర్ స్కూల్లో బడిగంట కొడుతున్న సిబ్బంది

బడి గంట మోగింది

- **తొలి రోజు 90 శాతం విద్యార్థుల హాజరు**

చిత్తూరు (సెంట్రల్), జూన్ 13: పాఠశాలలు పునఃప్రారంభమైన గురువారం విద్యార్థులు ఉత్సాహంగా బడులకు హాజరయ్యారు. ఆలయాల్లో పూజలు చేసి, తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి వారి ఆశీస్సులతో బడులకు వచ్చారు. తల్లిదండ్రులు వారి పిల్లల్ని పాఠశాలకు తీసుకువచ్చి కొత్త తరగతి గదుల్లో విడిచిపెట్టి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో 2.20 లక్షల మంది విద్యార్థులు ఉండగా, తొలి రోజున 1.99 లక్షల (90 శాతం) మంది విద్యార్థులు బడులకు వచ్చి పై తరగతి గదుల్లో ఆనందంగా అడుగుపెట్టారు. తొలి రోజు ప్రార్థన సమయంలో హెచ్ఎంలు విద్యార్థులకు స్వాగతం పలికారు. క్లాస్ టీచర్లు సైతం అంతే ఉత్సాహంతో విద్యార్థులతో పరిచయ కార్యక్రమాలు చేపట్టి, ఏడాది పొడవునా ఎలా చదవాలనే అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యాశాఖ అధికారులు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు.


విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్న టీచరు

ఉండేదెవరో.. మారేదెవరో?

వైసీపీకి అనుకూలంగా పనిచేసిన అధికారులకు స్థానచలనం ఖాయం
కీలక పోస్టుల కోసం ఇప్పట్నుంచే తహసీల్దార్ల పోటాపోటీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13: కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఈ క్రమంలో జిల్లాలోని అధికారుల్లో ఆయా స్థానాల్లో ఉండేదెవరు.. బదిలీ అయ్యేదెవరనే ప్రచారం జోరుగా సాగుతోంది. తమకు స్థానచలనం తప్పదనే ఆలోచనలో పలువురు అధికారులు ఉన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ నాయకుల ఒత్తిడికి లొంగి టీడీపీ-జనసేన-బీజేపీ నాయకుల పనులు పక్కనపెట్టి వేధించిన అధికారులపై బదిలీ ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. గెలిచిన ఎమ్మెల్యేలను ఆయా పార్టీల నేతలు మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. పనిలో పనిగా తమ ప్రాంతంలో అధికారుల పనితీరుపై వారికి సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. చాలా అంశాల్లో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పినట్లు చేశారంటూ కలెక్టర్ షన్మోహన్‌పై ఫిర్యాదులు వస్తున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో భాగంగా కలెక్టర్, జేసీతో పాటు జిల్లాస్థాయి అధికారుల బదిలీలు పెద్దఎత్తున ఉంటాయని అధికారుల అంతర్గత చర్చల్లో వినవస్తున్నాయి. ఇక, వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి, వారి అనుచరుల సూచనల మేరకు అడ్డగోలుగా పనిచేసిన అధికారులను జిల్లానుంచి సాగనంపుతారనే ప్రచారం మొదలైంది. ఫలానా అధికారిని జిల్లా నుంచి బయటకు పంపాలని ఎమ్మెల్యేలను కలుస్తున్న సమయంలో పార్టీ నాయకులు చెబుతున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాస్థాయి అధికారుల పనితీరు, వ్యవహారశైలిని వివరిస్తూ ప్రజలకు మేలు జరగాలంటే వీరిని మార్చాలని, అనుకూలురైన అధికారులను తీసుకురావాలని సిఫార్సులు కూడా చేస్తున్నారు. వీటిని గూర్చి పార్టీ అధిష్ఠానం ఎదుట తీసుకుని వెళ్ళేంతవరకు వేచివుండాలని, ఓపిక పడితే అన్ని సర్దుకుంటాయని గెలిచిన ఎమ్మెల్యేలు చెబుతున్నారు. కాగా, డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్డీఏ పీడీ తులసి, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, హార్టికల్చర్ డీడీ మధుసూదన్ రెడ్డి, ఎస్ఎస్ఏ పీవో వెంకటరమణరెడ్డి సహా పలువురు అధికారులు బదిలీ జాబితాలో ఉన్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. పులిచెర్ల సీడీపీవో మాజీ మంత్రి పెద్దిరెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా కొనసాగుతున్నారు. ఆమె పేరు కూడా బదిలీ జాబితాలో ఉన్నట్లు వినవస్తోంది. ఇంకా పలుశాఖల అధికారులు కూడా త్వరలో బదిలీ అవుతారని కలెక్టరేట్ ఉద్యోగులు చెబుతున్నారు. ప్రభుత్వం మారినప్పుడు ఇలా బదిలీలు జరగడం సాధారణమైనా.. గత ఐదేళ్లలో కొందరు స్వచ్ఛందంగా, మరికొందరు వైసీపీ ప్రజాప్రతినిధులు చెప్పినట్లు ఇష్టారాజ్యంగా పనిచేయడంతో ఈసారి ఆ సంఖ్య ఎక్కువగా ఉండనుంది.

పోస్టుల కోసం పోటాపోటీ

ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే జిల్లాలోని 31 మండలాల తహసీల్దార్లు జనవరి 31న ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఈనెల 20-30 తేదీల మధ్య ఇతర జిల్లాలకు వెళ్ళిన తహసీల్దార్లు మళ్ళీ జిల్లాకు రానున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు గెలవడంతో తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తుల ద్వారా మండలస్థాయి అధికారులు తాము కోరుకున్న మండలాల్లో పోస్టింగ్ వేయించుకోవడానికి ఇప్పటినుంచే మంతనాలు జోరుగా జరుపుతున్నారు. చిత్తూరు అర్బన్, గుడిపాల, పలమనేరు, పుంగనూరు, కుప్పం, గంగవరం, పూతలపట్టు, నగరి, విజయపురం వంటి కీలక మండలాల్లో పోస్టింగుల కోసం బయట జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు పోటీపడుతున్నారు.

పాలిసెట్ అడ్మిషన్లు ప్రారంభం

- **నేటినుంచి తరగతులు**

తిరుపతి(విద్య), జూన్ 13: పాలిసెట్-2024 మొదటి ఫేజ్ అభ్యర్థులకు సీట్ అలాట్‌మెంట్ పూర్తయి, ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ముందుగా విద్యార్థులు తమ వద్ద ఉన్న యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో https://appolycet.nic.in/Default.aspxలో లాగిన్ అవ్వాలి. తర్వాత అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అలాగే సెల్ఫ్ రిపోర్టింగ్ సిస్టమ్ ఆప్షన్ ద్వాంజాయినింగ్ అయితే అడ్మిషన్ నెంబరు వస్తుంది. ఆ తర్వాత జాయినింగ్ రిపోర్టును డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ రెండు కాపీలను, గతంలో కౌన్సెలింగ్ రోజున సమర్పించిన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను తీసుకుని సీట్ అలాట్ అయిన కళాశాలలో ఫిజికల్‌గా హాజరై అడ్మిషన్ తీసుకోవాలి. ఈ సమయంలో ఎలాంటి ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించాల్సిన అవసరం లేదు. ఈనెల 19వ తేదీలోపు ఇలా చేయని విద్యార్థుల సీట్ క్యాన్సిల్ అవుతుంది. కాగా, విద్యార్థులకు తరగతులు మాత్రం శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

18 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 18 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. చౌడేపల్లిలో 17.8మి.మీ, సోమల 14.6, తవణంపల్లె 14.6, గంగాధరనెల్లూరు 13.4, పెనుమూరు 12.0, పూతలపట్టు 10.4, సదుం 10.2, పాలసముద్రం 10.2, పులిచెర్ల 6.4, బైరాల 6.2, శ్రీరంగరాజపురం 5.6, పుంగనూరు 4.2, నగరి 3.4, వెదురుకుప్పం 3.2, పెద్దపంజాణి 2.8, చిత్తూరు అర్బన్ 2.2, రొంపిచెర్ల 1.6, చిత్తూరు రూరల్‌లో 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

నిలిచిన మీసేవలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13: ఐటీ సర్వర్లు హోల్డ్‌లోకి వెళ్లడంతో మీ-సేవల్లో సేవలు నిలిచిపోయాయి. విజయవాడ ఎస్డీసీ డేటా సెంటర్‌లో సర్వర్ల సమస్య, నెట్వర్క్ సమస్యలతో జిల్లాలోని మీసేవలు ఆగిపోయాయి. జిల్లాలో ఏపీ ఆన్‌లైన్ ఆధ్వర్యంలో గ్రామీణ స్థాయిలో సీఎంఎస్ ఆధ్వర్యంలో 450, మున్సిపాలిటీల్లో డీఎంసీ ఆధ్వర్యంలో 104 కేంద్రాలు ఉండగా, వాటిలో 80 శాతం కేంద్రాల నిర్వాహకులు గత ఐదేళ్లుగా చాలా ఇబ్బంది పడ్డారు. ఎందుకంటే సచివాలయాల ద్వారా కొన్ని సేవలను అందించడంతో మీసేవలకు వివిధ సర్వీసులు అందించే అవకాశం లేకుండా కేంద్రాల నిర్వహణ కష్టంగా మారింది. ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలయ్యాక మీ-సేవ కేంద్రాల వద్ద ప్రజలు వివిధ సేవలకోసం క్యూకట్టారు. అప్పట్లో జగన్ ఫొటోతో ఉన్న సర్టిఫికెట్లు నిలుపుదల చేసి, రాజముద్రతో సర్టిఫికెట్ల జారీ మొదలుపెట్టారు. కేవలం వారం రోజులు మాత్రమే ఈ విధమైన సేవలు అందించగలిగారు. పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునేలోగానే విజయవాడలో ఐటీ, ఏపీఫైబర్ నెట్ కార్యాలయాలపై ప్రభుత్వ తనిఖీలు చేపట్టడంతో ఐటీ సర్వర్లు హోల్డ్‌లోకి వెళ్ళాయి. ఫలితంగా మీ-సేవలో సేవలు ఆగాయి. 10 రోజులు దాటినా అవుతున్నా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీటిపై దృష్టిపెట్టేంతవరకు సమస్య పరిష్కారమయ్యే మార్గం కనిపించడం లేదు.


ముదోల్‌హౌండ్ కుక్కల అపహరణ


అపహరణకు గురైన ముదోల్‌హౌండ్ కుక్కలు (ఫైల్ ఫొటో)

పలమనేరు, జూన్ 13: పలమనేరు శివారులో నివాసం ఉంటున్న టమోటా మండీ వ్యాపారి నరేష్ ఇంటివద్ద ఉన్న ఖరీదైన రెండు ముదోల్‌హౌండ్ కుక్కలను దుండగులు అపహరించుకెళ్లారు. రెండురోజుల క్రితం ఇంటి వెలుపల ఉన్న వరండాలో ఉన్న ఈ కుక్కలను దుండగులు తీసుకెళ్లారంటూ నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కుక్కలను రూ.50 వేలు వెచ్చించి కొనుగోలు చేసి పెంచుతున్నట్లు తెలిపారు. తన కుక్కల ఆచూకీ తెలియజేసిన వారికి తగిన బహుమతి కూడా ఇస్తామని ఆయన అన్నారు.

తిరుమల వెంకన్న ఆశీస్సులతో అంచెలంచెలుగా ఎదిగా. రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడంతో పాటు దేశ రాజకీయాల్లో కూడా మంచి పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నా.ఏ సంకల్పం తీసుకున్నా ఒక నిమిషం వేంకటేశ్వరస్వామిని తలుచుకుని ముందుకు వెళ్లడం నాకు అలవాటు. చదువుకునే రోజుల్లో కూడా దేవుడికి మొక్కు తీర్చుకునేందుకు మంగాపురం నుంచి కొండకు నడిచివచ్చేవాళ్లం.బ్రహ్మోత్సవాల రోజుల్లో ఉపవాసముండి పూజల తర్వాత మధ్యాహ్నం భోంచేసేవాళ్లం.

శ్రీవారి ఆశీస్సులతోనే ఎదిగా



శ్రీవారి ఆలయంలో బాబు ధ్యానముద్ర



టీటీడీ నుంచే ప్రక్షాళన మొదలు

ఈ ఐదేళ్లలో తిరుమలలో ప్రసాదాలు మొదలుకుని పరిశుభ్రత వరకూ తిలోదకాలు ఇచ్చేశారు.పెద్దఎత్తున అవకతవకలు జరిగాయి.గంజాయి, అన్యమత ప్రచారం, లిక్కర్, నాన్‌వెజ్, ఇష్టానుసారం పైరవీలు చేసేందుకు కేంద్రంగా తిరుమలను మార్చేశారు.కక్షసాధింపు చర్యలు వుండకూడదు కానీ చెడ్డ వ్యక్తులను శిక్షించి మంచి వాళ్లను కాపాడుకోకపోతే దేవుడు కూడా సహకరించడు. తిరుమల పవిత్రమైన దివ్యక్షేత్రం.ఇక్కడ ఏడుకొండల వాడా వెంకట రమణా, ఓం నమో వేంకటేశాయా అనే భక్తుల నినాదాలు తప్ప మరొకటి వినిపించకుండా చూస్తాం.దేశమే కాదు... ప్రపంచం మొత్తం అభినందించేలా టీటీడీని తీర్చిదిద్దుతాం.

దటీజ్ చంద్రబాబు



రేణిగుంట, జూన్ 13: తిరుమల పర్యటన ముగించుకున్న చంద్రబాబు విజయవాడ వెళ్లేందుకు రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకున్నారు.అక్కడ వేచి వున్న సామాన్య ప్రజలను గుర్తించి వాహనం దిగి గ్యాలరీల వద్దకు వెళ్లి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అక్కడే ఆ సమస్యలను చదివి పక్కనే ఉన్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.గతంలో ముఖ్యమంత్రిగా వున్న జగన్ విమానాశ్రయానికి ఎప్పుడు వచ్చినా లోపలకు ప్రత్యేక కాన్వాయ్‌లో వెళ్లిపోయేవారు.సమస్యలను విన్నవించేం దుకు ఆశతో వచ్చిన ప్రజలకు నిరాశ మిగిల్చేవారు.

శ్రీవారి సేవలో సీఎం


తిరుమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. సంప్రదాయ వస్త్రధారణ, నుదుట తిరునామంతో గురువారం ఉదయం 8గంటలకు కుటుంబసభ్యులతో కలిసి చంద్రబాబు వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. సీఎం హోదాలో మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ ఎప్పటిలానే క్యూలైన్ ద్వారా మహద్వారం వద్దకు చేరుకున్న చంద్రబాబుకు శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితుల బృందం, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి ధ్వజస్తంభాన్ని తాకి గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టును దర్శించుకున్న చంద్రబాబుకు శేషవస్త్రాన్ని సమర్పించారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించారు.జేఈవో తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించిన సీఎం 8.55 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు.

జనాల్లో దూసుకుపోయిన సీఎం

సీఎం చంద్రబాబు శ్రీవారి దర్శన అనంతరం ఆలయం వెలుపలకు వచ్చి వాహనం వద్దకు చేరుకోవాలి. సెక్యూరిటీ అధికారులు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది ఆ మేరకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసి భక్తులను గొల్లమండపం వెనుకభాగంలో కట్టడి చేశారు. అయితే ఆలయం వెలుపలకు వచ్చిన చంద్రబాబు అఖిలాండం వద్దకు వెళ్లాలని చెప్పడంతో గొల్లమండపం పక్కనే ఉన్న దారి గేట్లను తెరిచారు. అక్కడినుంచి చంద్రబాబు భారీ సంఖ్యలో ఉన్న జనాల మధ్యలోనే ముందుకు వెళ్లారు. ఎస్ఎస్‌జీ సెక్యూరిటీ కాన్వాయ్ వద్దనే ఉండిపోవడంతో సాధారణ సెక్యూరిటీ సిబ్బందితో సహాయంతో అఖిలాండం వద్దకు చేరుకున్నారు. పక్కనే ఉన్న పెద్దజీయర్ మఠానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. తర్వాత అఖిలాండం వద్ద కొబ్బరికాయలు సమర్పించారు. సీఎం జనాల మధ్యలో వెలుతున్న సమయంలో పోలీసు ఉన్నతాధికారుల్లో టెన్షన్ కనిపించింది.



శ్రీవారి ఆలయంలోకి క్యూలైన్లో వెలుతున్న చంద్రబాబు



శ్రీవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో, ఎమ్మెల్యేలు, టీడీపీ ప్రముఖులతో

ముందుండి నడిపించండి

రాజకీయ ముసుగులో నేరాలు చేయాలంటే ఇక కుదరదు.ఎర్రచందనం స్మగ్లరుకు ఏకంగా ఎమ్మెల్యే సీటు ఇచ్చే ధైర్యం చేశారంటే వ్యవస్థను ఎంత పాడు చేశారో తెలుస్తోంది. చాలా ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది. శ్రీవారి సాక్షిగా చెబుతున్నా.మంచిని ప్రోత్సహిస్తా. చెడును తుంగలో తొక్కేస్తా.మేమొస్తే న్యాయం జరుగుతుందని ప్రతి ఒక్కరూ నమ్మకం పెట్టుకున్నారు.ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. గడిచిన ఐదేళ్లలో జరిగిన నష్టంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. తిరిగి పునర్నిర్మించు కోవాల్సిన అవసరముంది. ఆ శక్తిని దేవుడు టీడీపీకి ఇచ్చాడు. ప్రజలు కూడా ఓట్లు వేశాం పనైపోయింది అనుకోకుండా ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నా.

తప్పు చేసిన వారిని శిక్షించకపోతే వ్యవస్థపై ప్రభావం

● ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు



రఘురామకృష్ణరాజుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

రేణిగుంట, జూన్ 13: తప్పు చేసిన వారిని శిక్షించకపోతే వ్యవస్థపై ఆ ప్రభావం చూపుతుందని ఉండి ఎమ్మెల్యే రఘు రామ కృష్ణరాజు అభిప్రాయపడ్డారు. గురువారం రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో తనపై జరిగిన దాడిపై మెడికల్ రిపోర్ట్‌తో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాలన మారిన తరువాత పోలీసులు తీరు కూడా మారాలన్నారు. ఏ పదవిచ్చినా బాధ్యతగా వ్యవహరిస్తానన్నారు. అనంతరం తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు



ధ్వంసమైన అరటిపంటను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కల్లూరు, జూన్ 13: పులిచెర్ల మండలంలో వ్యవసాయ పంటలపై ఏనుగుల దాడులు 10 రోజులుగా కొనసాగుతున్నాయి. బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి సమీపంలో బుధవారం రాత్రి వ్యవసాయ పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. దీంతో అరటి, మామిడి, పశుగ్రాసం పంటలకు అపార నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన కోదండయ్య వ్యవసాయ పొలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు అరటిచెట్లను విరిచేశాయి. పశుగ్రాసాన్ని తొక్కేశాయి. డ్రిప్ పైపులు, గేట్‌వాల్వ్‌ను విరిచేశాయి. అనంతరం లవకుమార్, నాగరాజు, రామకృష్ణకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. మామిడికాయలను నేలరాల్చాయి. ఏనుగుల దాడిలో సుమారు 2 టన్నుల మామిడికాయలు నేలరాలినట్లు బాధిత రైతులు వాపోయారు. ఏనుగు దాడిలో నష్టపోయిన పంటలను రైతులతో కలిసి ఎఫ్‌బీవో శ్రీదేవి పరిశీలించారు. పంట నష్టంపై ఉన్నతాధికారులకు వివరాలు పంపుతామని తెలిపారు.

గుత్తార్లపల్లెలో అక్రమ గ్రానైట్‌కు అడ్డుకట్ట వేయరా?



గుడుపల్లె, జూన్ 13: గుడుపల్లె మండలం గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లెలో అక్రమ గ్రానైట్‌ను అడ్డుకట్టు వేయాలని ప్రజలు కోరుతున్నారు. నక్కనపల్లె రెవెన్యూలో సర్వే నెం. 62లో 15.20 ఎకరాల్లోని గుట్ట పోరంబోకు భూమి ఉంది. ఈ గుట్టలో తెల్ల రంగు గ్రానైట్ నిక్షేపాలున్నాయి. ఈ రాతి సంపదపై కుప్పానికి చెందిన ఓ వైసీపీ నేత కన్నుపడింది. కొన్ని నెలలుగా విలువైన గ్రానైట్ నిక్షేపాలను యంత్రాల సాయంతో తీస్తూ తమిళనాడు, కర్ణాటకకు రాత్రి వేళల్లో తరలిస్తున్నారు. రాతి సంపదను తీసేందుకు మందుగుండుతో పేలుళ్లు జరుపుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పేలుళ్ల వల్ల రాతి ముక్కలు రోడ్డుపై ప్రయాణించే వాహనదారులపై, ఆ సమీప పంట పొలాలపై పడుతున్నట్లు పలువురు వాపోయారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయిందనానరు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రానైట్ అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో చంద్రబాబు

తిరుచానూరు, జూన్ 13: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక తొలిసారిగా తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం కుటుంబ సమేతంగా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. ఆలయం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దంపతులకు జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మొదట వీరు ధ్వజస్తంభానికి నమస్కరించాక గర్భాలయంలో మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వేదపండితులు ఆశీర్వచన మండపంలో వేదాశ్వీరచనం చేసి.. అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో సుమారు 20 నిమిషాలు గడిపారు. అనంతరం చంద్రబాబు ఆలయం వెలుపలకు బయటకు రాగానే భక్తులు, స్థానికులు సీఎం.. సీఎం అంటూ నినాదాలు నినాదాలు చేయడంతో వారిని వారించి ఆలయం వద్ద గోవిందనామ స్మరణ చేయాలని.. అభివాదం చేసి బయల్దేరి వెళ్లారు. అంతకుముందు ఆలయం వద్ద సీఎం చంద్రబాబుకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు స్వాగతం పలికారు. చంద్రబాబుతోపాటు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి ఉన్నారు. గతంలో వీవీఐపీలు దర్శనానికి వస్తే ఆలయం వద్ద దుకాణాలు మూసి పరదాటు కట్టి భక్తులకు ఇబ్బంది కల్గించేవారు. చంద్రబాబు రాక సందర్భంగా ఎలాంటి హడావుడి లేకుండా యథావిధిగా స్థానికులు, భక్తులు ఆలయ పరిసరాల్లో కలియదిరిగారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న పులివర్తి నాని దంపతులు

ఆగస్టు నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

జూలై 11 నుంచి ఇంటింటి సర్వే ● డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, జూన్ 13: క్యాన్సర్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా ఆగస్టు నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో ప్రభావతి తెలిపారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ బారినపడి ఏటా అనేక మంది మహిళలు మృత్యువాతపడుతున్నారని తెలిపారు. ముందుగానే గుర్తిస్తే నయం చేయవచ్చునని, ఇందుకోసం డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. జూలై 10వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి, క్యాన్సర్ బాధితులకు ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. రాష్ట్ర మానిటరింగ్ అధికారి డాక్టర్ సునీల్‌నాయక్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలిచ్చారు. ఎన్‌సీడీ కోఆర్డినేటర్ శిరీష, డీపీవో హర్షవర్ధన్, గైనకాలజిస్టులు మీనా సయ్యద్, మాధవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

మళ్లీ గరుడవారధిగా మారుతుందా?

వైసీపీ పనిగట్టుకుని మార్చిన పేరుపై ప్రజల్లో అసంతృప్తి



గరుడవారధి అనే పేరు మళ్లీ వస్తుందా, రాదా అనే చర్చ తిరుపతి నగరంలో వినిపిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వంలో రూపుదిద్దుకుని మొదలైన నిర్మాణ పనులు వైసీపీ అధికారంలోకి రాగానే ఆగిపోయిన సంగతి తెలిసిందే. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో తిరిగి పనులు మొదలు పెట్టారు. 24 నెలల్లో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రావలసిన వారధి నిర్మాణానికి సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ముక్కీ మూలిగీ నాలుగున్నరేళ్లకు గాని పూర్తి కాలేదు. చంద్రబాబు విజన్‌గా ప్రజల్లో గుర్తింపు పొందిన గరుడవారధి అనే పేరును వైసీపీ నేతలు మార్చేశారు. టీడీపీ గురుతులేవీ కనిపించరాదు, వినిపించరాదు అనే కారణంతో 'శ్రీనివాస సేతు'గా నామకరణం చేశారు. అయితే వారధి మీద వరుసగా ఉన్న దీపపు స్తంభాల మీద ఉన్న గరుడ లోహపు బొమ్మలు చూస్తున్న జనం మాత్రం దీనిని గరుడ వారధిగానే గుర్తిస్తున్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి టీడీపీ రావడంతో జనంలో ఉన్న గరుడవారధి అనే పేరునే తిరిగి కొనసాగిస్తారనే ప్రచారం జరుగుతోంది.

- తిరుపతి ఆంధ్రజ్యోతి

రేపు జాబ్ మేళా

చిత్తూరు రూరల్, జూన్ 13: చిత్తూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ చిత్తూరు బ్రాంచ్‌లో సేల్స్ ఆఫీసర్, యూనిట్ మేనేజర్, ఫైనాన్స్ అడ్వైజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పార్ట్‌టైమ్, ఫుల్ టైం పనిచేసేందుకు వీలు ఉంటుందని, 18 నుంచి 40 సంవత్సరాల లోపు వారు, ఏదైనా ఇంటర్, డిగ్రీ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13: ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలను తిరుపతి క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దాదాపు 25 లక్షలు విలువ చేసే 400 గ్రాముల బంగారు నగలు, 2.25 కిలోల వెండి ఆభరణాలు, టీవీలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి క్రైం డీఎస్పీ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడుతూ లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రజలు సొత్తును అపహరిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, నారాయణవనం, వెంకటగిరి, చిత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో 11 ఇంటి దొంగతనాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. ఎస్పీ ఆదేశాలతో రెండ్రోజులుగా నిందితుల కోసం క్రైం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. క్రైం డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు కళా వెంకటరమణ, రామకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు రవి, గోపీకృష్ణ, బసవరాజు రమేష్, శ్రీనివాస్, వినాయకం వేర్వేరు బృందాలుగా విడిపోయి గాలించారు. వేదిక్ యూనివర్సిటీ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని విచారించగా నేరాలు బయటపడ్డాయి. దాంతో వీరిని తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లా గూడళ్లూరు గ్రామానికి చెందిన మగేష్ మణికంఠ, పశ్చిమ గోదావరి జిల్లా తంగేలా మూడి గ్రామానికి చెందిన షేక్ అలీ మొహిద్దీన్‌లుగా గుర్తించి, అరెస్టు చేశారు. మగేష్ మణికంటపై తిరుపతి, నారాయణవనం, రేణిగుంట, వెంకటగిరి ప్రాంతాల్లో 50 కేసులున్నాయి. షేక్ అలీ మొహిద్దీన్‌పై 40 కేసులుండగా, నిడదవోలు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉందని డీఎస్పీ తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

రెండు బైక్‌లు, 1.5 కిలోల సరుకు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13: తిరుపతిలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా గిరిదర్శిని లేఅవుట్‌లో ఉంటున్న భరత్, యలహంకకు చెందిన కార్తీక్ అంజన్ కుమార్ కొంతకాలంగా తిరుపతిని అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నారు. వీరు బెంగళూరు నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని, ఇక్కడ విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అందిన సమాచారంతో తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె సర్కిల్ వద్ద సీఐ వినోద్‌కుమార్, ఎస్ఐ షేక్షావల్లి, సిబ్బంది కలసి తనిఖీలు చేపట్టారు. ఇద్దరు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని విచారించారు. వారివద్ద చిన్న, చిన్న ప్యాకెట్లు కలిగిన గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరితో పాటు చిన్నపిల్ల వాడు ఉన్నాడు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి.. తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వద్ద హాజరుపరచగా నిందితులకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించాలని ఆదేశించారు.

చంద్రబాబుకు ఎమ్మెల్సీల శుభాకాంక్షలు



కుప్పం, జూన్ 13: అమరావతిలో నాల్గవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబును గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మెగా డీఎస్సీ ఫైల్ పై తొలి సంతకం చేసి, నిరుద్యోగ ఉపాధ్యాయుల ఆశలు తీర్చినందుకు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు.

సోమలలో టీడీపీ సంబరాలు



సోమల, జూన్ 13: ఏపీ సీఎంగా చంద్రబాబు నాలుగో పర్యాయం బాధ్యతలు స్వీకరించడంతో గురువారం సోమల బస్టాండ్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, శ్రీనివాసులు, శివశంకర్, వెంకటసుబ్బయ్య శెట్టి, బాబురావు, లక్ష్మయ్య, శివ ప్రసాద్, శివయ్యనాయుడు, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆశాకిరణం చంద్రబాబు

పుంగనూరు, జూన్ 13: ఎన్నికల హామీల్లో భాగంగా ప్రమాణ స్వీకారం తర్వాత సీఎం చంద్రబాబు తొలిసంతకం డీఎస్సీ ఉద్యోగుల నోటిఫికేషన్‌పై పెట్టి నిరుద్యోగులకు ఆశాకిరణంగా నిలిచారని రాజంపేట పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్, తెలుగుయువత నాయకులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పెద్దఎత్తున బాణాసంచాపేల్చుతూ స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ నిరుద్యోగ ఉపాధ్యాయులు, ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులకు మోసం చేశారని మండిపడ్డారు. గతపాలకులు అరాచకాలతో 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిన రాష్ట్రాన్ని చంద్రబాబు ముందుకు తీసుకుకెళుతారన్నారు. ఇక ప్రజలకు మంచిరోజులు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు మార్వారి రమేశ్, మోహన్‌నాయుడు, హేమాద్రి, శశి, మహేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలో దంపతులకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న అరుణ, శ్రీరాములు

పుంగనూరు రూరల్, జూన్13: భూతగాదా ఘర్షణలో దంపతులు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం రాత్రి పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని వనమలదిన్నెకు చెందిన శ్రీరాములుకు అదే గ్రామానికి చెందిన గణేశ్‌కు కొంత కాలంగా ఇంటి స్థలం విషయంపై వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గణేశ్, నారాయణలు కలిసి వివాదం ఉన్న ఇంటి స్థలంలో నిర్మాణ పనులు చేయడానికి ప్రయత్నించారు. దీంతో శ్రీరాములు, అతని భార్య అరుణ అడ్డుచెప్పారు. ఈ క్రమంలో వారిపై దాడి చేయడంతో శ్రీరాములు, అరుణ తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబసభ్యులు వారిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

16న బైరెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, జూన్ 13: బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఈనెల 16వ తేదీ ఉదయం 10గంటలకు మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యనిపుణులచే ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అన్ని వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు జరిపి అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పవన్‌ను కలిసి యుగంధర్

వెదురుకుప్పం, జూన్ 13: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆ పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న గురువారం విజయవాడలో కలిశారు. నియోజకవర్గ పరిస్థితిని వివరించామని చెప్పారు.

ఒత్తిడిలేని విద్య అవసరం : డీఈవో



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో దేవరాజు

గంగాధరనెల్లూరు, జూన్ 13: విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించాలని డీఈవో దేవరాజు అన్నారు. నెల్లేపల్లె హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. 2023-24 విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించడంపై హెచ్ఎంను, టీచర్లను అభినందించారు. ఎంఈవో కాణిపాకం ఆంజనేయులు శెట్టి, హెచ్ఎం సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జి హెచ్ఎం యుగంధరాచారి పాల్గొన్నారు.

'ఆ అధికారి అవినీతిపై విచారణ జరపండి'

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13: బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ జిల్లా కోఆర్డినేటర్ విజయభారతి అవినీతి కార్యకలాపాలపై విచారణ చేపట్టాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ షన్మోహ న్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇలాఖాలో ఐదేళ్లలో ఆమె చాలా అవినీతి పనులకు పాల్పడ్డారని ఆరోపించారు.

వరసిద్ధుడి సేవలో ఎలమంచిలి ఎమ్మెల్యే

ఐరాల(కాణిపాకం), జూన్ 13: విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం కాణిపాక వరసిద్ధుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విష్ణేష్, జనసేన నేతలు రాజ్‌కుమార్, పూలప్రభాకర్, మునిరాజు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

పాలసముద్రం, జూన్ 13: మండలంలోని కృష్ణజిమ్మాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలను గురువారం ధ్వజారోహణంతో ప్రారంభించారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు మహాభారత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బాలయ్య నాయుడు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

స్వీట్లు పంచుకున్న వృద్ధులు, దివ్యాంగులు

కల్లూరు, జూన్ 13: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే చంద్రబాబు పింఛన్ల పెంపుపై సంతకం చేశారు. దీంతో పులిచెర్ల మండలంలోని దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్లంకివారిపల్లిలో వృద్ధులు స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్ అమలు, స్కిల్ సెన్సస్‌పై సంతకాలు చేయడం చరిత్రాత్మకమని తెలియజేశారు. చంద్రబాబు ఎప్పుడూ పేదల అభ్యున్నతికి కృషిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపినాయుడు, పార్థసారధి, గిరిబాబు, దేవ, సురేంద్ర, భాస్కర్, తేజ, కిషోర్, రవినాయుడు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణ



ఎంఈవో కు వినతిపత్రం అందేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 13: రామకుప్పం పట్టణ శివార్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శాంతినికేతన్ ఇంగ్లీష్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కేశవరెడ్డి, నవీన్ సహా పలువురు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈవో నారాయణకు వినతిపత్రం అందజేశారు. శాంతినికేతన్ స్కూల్‌కు కేవలం 5వ తరగతి వరకే ప్రభుత్వ అనుమతులున్నాయని కానీ 6 నుంచి 10 వ తరగతి వరకు, అనుభవం లేని ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహిస్తోందని ఫిర్యాదు చేశారు. వెంటనే పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంఈవో వారికి హామీ ఇచ్చారు.

శిలాఫలకాల ధ్వంసంపై చర్యలు తీసుకోండి

పుంగనూరు రూరల్, జూన్13: మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేసిన టీడీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ భాస్కర్ రెడ్డి, వైసీపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో మునిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

వేణుగోపాలుడికి విశేషపూజలు



శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవం

గుడుపల్లె, జూన్ 13: మండలంలోని శెట్టిపల్లెలోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవర్లను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

బాబు సీఎం అయ్యాడని కాలినడకన తిరుమలకు..



పెనుమూరు, జూన్ 13: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాడని మండలంలోని గొబ్బిళ్లమిట్ట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురువారం తిరుమలకు కాలినడకన వెళ్లారు. బాలాజినాయుడు, యుగంధర్, సుబ్రమణ్యం, విద్యాసాగర్, ప్రతాప్‌నాయుడు, దివాకర్, నాదముని, జనసేన నాయకులు రాజు, జ్ఞాన గ్రామంలోని ఆలయంలో పూజలు చేసి, తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

మళ్లీ అన్న క్యాంటీన్..రూ.5కే భోజనం



కుప్పంలోని అన్న క్యాంటీన్ భవనం

కుప్పం, జూన్ 13: కుప్పంలో అన్న క్యాంటీన్ భవనం తెరుచుకోనుంది. పేదల ఆకలి తీర్చేం దుకు సిద్ధం కానుంది. టీడీపీ హయాంలో ప్రారంభమైన అన్న క్యాంటీన్, వైసీపీ అధికారంలోకి రాగానే మూతపడి, మళ్లీ ఇప్పుడు పేదల కడుపు నింపడం ఎప్పుడెప్పుడా అని ఆర్తితో నిరీక్షిస్తోంది. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక, రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. పేదలకు రూ.5కే రుచికరమైన భోజనం వడ్డించారు. ఆర్టీసీ బస్టాండుకు దగ్గరగా ఏర్పాటు చేసిన ఈ అన్న క్యాంటీన్‌లో నిత్యం వందల సంఖ్యలో పేదలు రూ.5కే భోజనం చేసేవారు. తర్వాత ఇదే ప్రదేశంలో క్యాంటీన్‌కోసం సొంత భవనం నిర్మించారు. ఈలోగా 2019లో టీడీపీ అధికారం కోల్పోయింది. వైసీపీ ప్రభుత్వ పాలన ప్రారంభమైంది. జగన్ సీఎం కాగానే అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదల కడుపు కొట్టారు.

● చంద్రన్న ప్రేరణతో ఉచితంగా అన్నదానం: ప్రతిపక్షంలో ఉన్నా సరే అన్న క్యాంటీన్‌ను నడపాలని చంద్రబాబు నిశ్చయించారు. టీడీపీ శ్రేణులు, ఇతర దాతల సహకారంతో అన్న క్యాంటీన్ పేరుతో ఆర్టీసీ బస్టాండు కూడలిలో, ఎన్టీఆర్ విగ్రహం ఎదుట పేదలకు మధ్యాహ్నం పూట అన్నదానం ప్రారంభించారు. అయితే చంద్రబాబు పర్యటన సందర్భంగా అన్న క్యాంటీన్‌కోసం వేసిన తాత్కాలిక షామియానాను వైసీపీ శ్రేణులు కూల్చివేయడమే గాక టీడీపీ నేతలు, కార్యకర్తలపై ఎదురు కేసులు పెట్టాయి. ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఆర్టీసీ బస్టాండు కూడలిలో ధర్నాకు దిగిన చంద్రబాబుపైనా అప్పట్లో కేసు నమోదైంది. అయితే దీనిపై తర్వాత తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వెల్లువెత్తడంతో మళ్లీ అన్న క్యాంటీన్ జోలికి వైసీపీ మూకలు రాలేదు.

● రాజన్న క్యాంటీన్ పేరుతో హడావుడి: టీడీపీ అన్న క్యాంటీన్‌కు బహుళ ఆదరణ లభించడంతో ఎన్నికల ముందు వైసీపీ కూడా ఇదేరకమైన ఎత్తు వేసింది. ఎమ్మార్ రెడ్డి సర్కిల్ సమీపంలో అన్నదానం మొదలు పెట్టింది. మరోవైపు టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ కోసం నిర్మించిన భవనంలోకి రాజన్న క్యాంటీన్‌ను మార్చడానికి ప్రయత్నించింది. ఇందుకోసం సదరు భవనానికి వెల్ల వేయించింది. అయితే ఈలోగా ఎన్నికల కోడ్ వచ్చేయడంతో ప్రజలను మభ్యపెట్టడానికి అది చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇప్పుడు టీడీపీ మరోసారి అధికారంలోకి వచ్చింది. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గతంలో నిర్మించిన భవనంలోనే అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది. చంద్రబాబు కుప్పం పర్యటనకు త్వరలోనే రానున్నారని, అప్పుడు అన్న క్యాంటీన్‌ను ఆయన చేతులమీదుగా ప్రారంభిస్తామని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి.

ఘనంగా గంగమ్మ జలధి వాసం



కోలాహలంగా అమ్మవారి ఊరేగింపు



గంగమ్మకు కల్లు తీసుకెళుతున్న భక్తులు

సోమల, జూన్ 13: సోమలలో గంగ జాతర వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి 12 గంటలకు అమ్మవారి జలాధివాస కార్యక్రమం కోలాహలంగా సాగింది. స్థానిక శివాలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. అడు సుపల్లె సమీపంలోని చెరువు వద్దకు తీసు కెళ్లడంతో మార్గమధ్యంలోని దళితవాడ, అడుసు పల్లె, బుంగావారిపల్లె, గుంత చెరువు పల్లె గ్రామాల ప్రజలు మంగళ హారతులు సమర్పించారు. చెరువు వద్ద ఆసాదివారు అమ్మ వారికి పూజలు జరిపి శాస్త్రోక్తంగా జలాధివాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, చెన్నరాయప్ప, సుధాకర్, జగన్‌మోహన్, నాగరాజ, సురేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం

పలమనేరు, జూన్13 : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యా సామగ్రిని ఆయా పాఠశాలలకు పంపుతున్నట్లు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం పేర్కొన్నారు. గురువారం పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 6,950 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బూట్లు, బెల్టులు, నోటు పుస్తకాలు, వచ్చాయన్నారు. కాగా ఇంకా కొన్ని సబ్జెక్టులు రావాల్సి వుందన్నారు. బ్యాగులు, యూనిఫారం రావాల్సి వుందన్నారు. ఒకటి నుంచి 5వరకు చదువుకొంటున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతోపాటు మూడు జతల యూనిఫారం క్లాత్, బెల్టు, ఒక జత షూస్, రెండుజతల సాక్సులు, ఇంగ్లీషు నిఘంటువు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 6నుంచి 10 వతరగతి చదువుతున్న విద్యార్థులకు మూడు జతల యూనిఫారం, చున్నీతో సహా, బ్యాగ్, బెల్టులు, పాఠ్యపుస్తకాలు, మండలంలోని 70 పాఠశాలలకు ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షంషీర్, సీఆర్ఎంపీలు, పార్టుటైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్, తదితరులు హాజరయ్యారు.

అరాచకాలకు బ్రాండ్ అంబాసిడర్ పెద్దిరెడ్డి : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 13: అరాచకాలకు బ్రాండ్ అంబాసిడర్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబమని టీడీపీ నేతలు ఆరోపించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం, నరమేధం తప్పా అభివృద్ధి జాడే లేదని విమర్శించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని, శాంతి భద్రతలను కాపాడాలని, దౌర్జన్యాలు ఆపాలని మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పోలీసు, న్యాయ వ్యవస్థలను, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. నోరు తెరిచి ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని వైసీపీ నేతలు ఆలస్యంగా తెలుసుకున్నారన్నారు. ఐదేళ్ల రాష్ట్రంలో జరిగిన అరాచకాలపై బహిరంగ చర్చకు వైసీపీ పెద్దలు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై నిరుద్యోగుల హర్షం

సోమల, జూన్ 13: ఏపీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించాక మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. దీంతో నిరుద్యోగ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. 16, 347 పోస్టులు ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. సోమల బస్టాండ్‌లో నిరుద్యోగ యువత టపాసులు పేల్చి స్వీట్లు పంచారు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం



నంజంపేట హైస్కూల్లో పర్యావరణ దినోత్సవం

సోమల, జూన్ 13: మండలంలోని నంజంపేట హైస్కూల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో పర్యావరణ ఆవశ్యకతపై నినాదాలు చేశారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. పాఠశాల ఆవరణంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్ మోహన్, మోహన్‌రెడ్డి, శ్రీదేవి, రాజేశ్, వసంతకుమారి, గాయత్రి పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



హరికథను వినిపిస్తున్న భాగవతారిణి భారతి

కల్లూరు, జూన్ 13: పులిచెర్ల మండల కేంద్రంలోని మహాభారత యజ్ఞం ప్రాంగణంలో గురువారం మహాభారతం ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ముందుగా ద్రౌపది ధర్మరాజుల ఆలయంలో గురువారం వేకువజామున భక్తిశ్రద్ధలతో గెరిగపూజ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో భాగవతారిణి భారతి మొదటిరోజు సర్పయాగం హరికథను భక్తులకు వినిపించారు. ఈ నెల 16 నుంచి రాత్రి వీధినాటకం ప్రారంభమవుతుందని, ఈ నెల 30 వరకు మధ్యాహ్నం హరికథ, రాత్రి వీధినాటకం ఉంటుందని నిర్వాహకులు తెలియ జేశారు.

బాటగంగమ్మకు పూజలు

రొంపిచెర్ల, జూన్13: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ మేళ్లయ్యగారి పల్లెలో ఈ నెల 13వ తేదీ మొదలైన బాటగంగమ్మ తిరుణాల 17 వరకు జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం, దుర్గహోమం, పూర్ణాహుతి, కలశాభిషేకం, ధ్వజారోహణం, అభిషేకం తదితరపూజలు నిర్వహించారు. మిగిలిన రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, అగ్నిగుండ ప్రవేశం వంటి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

పుంగనూరు, జూన్13: జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పుంగనూరు జనసేన నాయకులు శివప్పనాయుడు, చిన్నారాయల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ఏర్పాటు, సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రముఖపాత్ర పోషించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీని పటిష్టపరచడానికి ప్రతి జన సైనికుడూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, హరి, చంద్ర, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చనున్న అన్నక్యాంటీన్

పలమనేరు, జూన్13 : పేదల ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం రాగానే మూసేసింది. ఈ క్రమంలో పలమనేరులోనూ ఐదేళ్లుగా మూసేశారు. అయితే తాము స్వచ్ఛందంగా నడిపిస్తామని టీడీపీ నాయకులు ఇక్కడి మున్సిపల్ అధి కారులను కోరినా వారు ప్రభుత్వ ఆదేశాలను తాము అనుసరించక తప్పదని చేతులెత్తేశారు. పైగా అన్నక్యాంటీన్ భవనాన్ని గాలికి వదిలేశారు. ఫలితంగా ఈ అన్నాక్యాంటీన్ చీకటి కార్యకలా పాలకు నిలయంగా మారిపోయింది. అలా పల మనేరులో అన్నక్యాంటీన్ మూతపడి మూడేళ్ల గడిచిపోవడంతో మాజీ మాజీ మంత్రి అమర నాథరెడ్డి ఆధ్వర్యంలో పలమనేరు మార్కెట్ యార్డు వద్ద అన్నక్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ అన్నక్యాంటీన్‌లో తెలుగుదేశం పార్టీ నాయ కులు, కార్యకర్తలు తమ పుట్టినరోజుల్లో, విశేష మైన రోజుల్లో పేదలకు మధ్యాహ్నం ఆకలి తీర్చుతూ వస్తున్నారు. ఇలా ఏదో ఒక సందర్భం పేరుతో రోజూ పేదల కడుపు నింపేవారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల నెరవేర్చే కార్యక్రమంలో భాగంగా అన్నక్యాంటీన్ల పునః ప్రారంభోత్సవం ఫైల్‌పై సీఎం చంద్రబాబు గురువారం సంతకం చేయడంతో ఇక్కడి పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన అన్నాక్యాంటీన్ భవనం మళ్లీ వినియోగంలోకి వస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకొన్నారని అభినందిస్తున్నారు.

కొత్తయిండ్లును సందర్శించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు

బైరెడ్డిపల్లె, జూన్ 13 : తాగునీరు కలుషితమై అతిసార ప్రబలిన కొత్తయిండ్లు గ్రామాన్ని గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులు సందర్శించారు. రెండురోజుల క్రితం గ్రామంలో ఆరుగురు అతిసార బారిన పడడంతో స్పందిం చిన అధికారులు గ్రామంలో పర్యటించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ విజయకుమార్, ఈఈ రెడ్డెయ్య, డీఈ రవికుమార్ గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అతిసార నుంచి కోలుకుంటున్న బాధితులను పరామర్శించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, పైపులైన్లు లీకేజీలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో పాటు ఐఈసీ జిల్లా కన్సల్టెంట్ శాంతి, బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేష్, ఈవోఆర్డీ రాజేంద్రబాలాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లోకనాథం, ఎంఈవో సురేష్‌బాబు, గ్రామకార్యదర్శి నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అమరేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ విజయకుమార్ శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఒత్తిడిలేని విద్య అవసరం : డీఈవో


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో దేవరాజు

గంగాధరనెల్లూరు, జూన్ 13: విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించాలని డీఈవో దేవరాజు అన్నారు. మండలంలోని నెల్లేపల్లె హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. 2023-24 విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించడంపై హెచ్‌ఎంను, టీచర్లను అభినందించారు. ఎంఈవో కాణిపాకం ఆంజినేయులుశెట్టి, హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం యుగంధరాచారి పాల్గొన్నారు.

రోడ్డుపైనే వర్షపు నీరు



కార్వేటినగరం, జూన్ 13: మండలంలోని కేఎంపురం గ్రామ పంచాయతీలో రోడ్డుపైనే వర్షపు నీరు నిల్వ ఉంటూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తోంది. గుంతల్లో నీరు నిల్వ ఉండడం వల్ల వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎల్‌ఆర్ పేట, కొటారుపీడు గ్రామ పంచాయతీ ప్రజలు మండల కేంద్రానికి ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉంది. నిల్వ ఉన్న మురుకు నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న అజయ్‌కుమార్‌రెడ్డి

తవణంపల్లె, జూన్ 13: మండలంలోని 65 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లా సమగ్ర శిక్షా కో-ఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో యలమంచిలి ఎమ్మెల్యే


జ్ఞాపిక అందిస్తున్న సూపరింటెండెంట్

ఐరాల(కాణిపాకం), జూన్ 13: విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం కాణిపాక వరసిద్ధుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, జనసేన నేతలు రాజ్‌కుమార్, పూలప్రభాకర్, మునిరాజు పాల్గొన్నారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి


వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, జూన్ 13: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధికి చెక్ పెట్టవచ్చునని, అర్హులందరూ వేయించుకోవాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి కోరారు. గురువారం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ డే సందర్భంగా అనుపల్లి గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. 18 సంవత్సరాలు పైబడిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న ఇంట్లోని 18 సంవత్సరాలు పైబడిన వారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కేజీల కన్నా తక్కువ బరువున్న వారికి ఇది తప్పనిసరి అని పేర్కొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

పాలసముద్రం, జూన్ 13: మండలంలోని కృష్ణజిమ్మాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలకు ప్రారంభ సూచికగా గురువారం ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు మహాభారత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బాలయ్య నాయుడు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు


వరినాట్ల కోసం సిద్ధం చేసిన పొలం

కార్వేటినగరం, జూన్ 13: వర్షాలు ఆశాజనకంగా పడుతుండడంతో మండలంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మండలంలోని చెరువులకు కృష్ణాపురం ప్రాజెక్టు కాలువ ద్వారా నీటిని తరలించారు. ఈ క్రమంలో చెరువులు, గొట్టపు బావుల ఆధారంగా వరినాట్లు వేస్తున్నారు. దాదాపు 300 ఎకరాలలో వరినాట్లు వేసే అవకాశముందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు.

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం

వెదురుకుప్పం, జూన్ 13: రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్ మురళి పేర్కొన్నారు. బాబు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని వెదురుకుప్పంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తొలిసారిగా తెలుగుదేశం పార్టీ గెలవడం శుభపరిణామమని అన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు ఉన్నారు.


పార్టీ నేతలతో కలిసి కేక్ కట్ చేస్తున్న మోహన్‌మురళి

నేడు సింహ వాహన సేవ

చిత్తూరు కల్చరల్, జూన్ 13 : నగరంలోని తేనెబండ ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం సింహ వాహన సేవ నిర్వహిస్తున్నట్లు ఈవో తిమ్మారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక అభిషేకం, పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, సింహ వాహనంపై కొండచుట్టు తిరునాళ్ల నిర్వహించనున్నామని వెల్లడించారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

చిత్తూరు కల్చరల్, జూన్ 13: స్థానిక మార్కెట్ చౌక్ సమీపంలో వెలసిన సంతాన గణపతి ఆలయ మహా కుంభాభిషేకాన్ని ఆలయ నిర్వాహకులు గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, గోపుర కలశ స్థాపన, నవగ్రహ జ్యోతిర్లింగ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆ అధికారి అవినీతిపై విచారణ జరపండి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13: బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ జిల్లా కోఆర్డినేటర్ విజయభారతి అవినీతి కార్యకలాపాలపై విచారణ చేపట్టాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ షన్మోహన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇలాఖాలో ఐదేళ్లలో ఆమె చాలా అవినీతి పనులకు పాల్పడ్డారని ఆరోపించారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న రుద్రయ్యనాయుడు

పెనుమూరు, జూన్ 13: స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో గురువారం మహాభారత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా శ్రీకారకొడి ఊరేగింపు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పరమేశ్వరరెడ్డి, రాజగోపాల్ నాయుడు, దేవరాజులునాయుడు, గంగయ్య పాల్గొన్నారు.

టీడీపీ నేతల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కార్వేటినగరం, జూన్ 13: చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడంపై కార్వేటినగరంలోని గుండు గురుస్వామి వీధిలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శేషాద్రి యాదవ్, వెంకటకృష్ణ యాదవ్, కొండూరు త్యాగరాజు, ఎంపీటీసీ వాసుదేవరెడ్డి, నౌషద్, మునీర్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



కార్వేటినగరం, జూన్ 13: మండలంలోని కోదండ రామాపురంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మూడేళ్లుగా దాని గురించి పట్టించుకోకపోవడంతో అటు సిబ్బంది, ఇటు చిన్నారులు అద్దె భవనంలో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

భూ తగాదాలో ఇద్దరికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న అరుణ, శ్రీరాములు

పుంగనూరు రూరల్, జూన్13: భూతగాదా ఘర్షణలో దంపతులు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం రాత్రి పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని వనమలదిన్నెకు చెందిన శ్రీరాములుకు అదే గ్రామానికి చెందిన గణేశ్‌కు కొంత కాలంగా ఇంటి స్థలం విషయంపై వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గణేశ్, నారాయణలు కలిసి వివాదం ఉన్న ఇంటి స్థలంలో నిర్మాణ పనులు చేయడానికి ప్రయత్నించారు. దీంతో శ్రీరాములు, అతని భార్య అరుణ అడ్డుచెప్పారు. ఈ క్రమంలో వారిపై దాడి చేయడంతో శ్రీరాములు, అరుణ తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబసభ్యులు వారిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేణుగోపాలుడికి విశేష పూజలు



గుడుపల్లె, జూన్ 13: మండలంలోని శెట్టిపల్లెలోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవర్లను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.


చంద్రబాబుతో ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు, నాయకులు సీఆర్ రాజన్, దొరబాబు, చంద్రప్రకాష్ - వీడ్కోలు పలుకుతున్న ఏఎస్ మనోహర్, సప్తగిరి ప్రసాద్ - చంద్రబాబుతో కలసి శ్రీవారి దర్శనం చేసుకున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

సీఎం చంద్రబాబును కలసిన జిల్లా నేతలు

చిత్తూరు సిటీ, జూన్13: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పలువురు జిల్లా నేతలు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో కలసి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తిరుపతి జనసేన పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, వైవీ రాజేశ్వరి, సప్తగిరి ప్రసాద్ చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు.

అరాచకాలకు బ్రాండ్ అంబాసిడర్ పెద్దిరెడ్డి : టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 13: అరాచకాలకు బ్రాండ్ అంబాసిడర్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబమని టీడీపీ నేతలు ఆరోపించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం, నరమేధం తప్పా అభివృద్ధి జాడే లేదని విమర్శించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని, శాంతి భద్రతలను కాపాడాలని, దౌర్జన్యాలు ఆపాలని మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పోలీసు, న్యాయ వ్యవస్థలను, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. నోరు తెరిచి ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని వైసీపీ నేతలు ఆలస్యంగా తెలుసుకున్నారన్నారు. ఐదేళ్ల రాష్ట్రంలో జరిగిన అరాచకాలపై బహిరంగ చర్చకు వైసీపీ పెద్దలు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో ప్రతిభ


చరిత్ చౌదరి సీమ చందన

చిత్తూరు (సెంట్రల్), జూన్ 13: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో స్థానిక పీఎస్ఎన్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచారని కరస్పాండెంట్ పి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి తెలిపారు. పి.చరిత్ చౌదరి (2272), సీఎస్.సీమ (2967), ఎంబీ.చందన (3124), ఎల్.నేహిత్ (3205), వి.ప్రీతి (4367), కె.దినేష్‌కార్తిక్ (5045), ఏపీ.పవన్ (5369), టి.గీతాశ్రీ (5756), ఏవీ.కిషన్‌కుమార్ (6409), ఎ.రిత్విక్‌రాజ్ (6478) ర్యాంకులు సాధించారని వెల్లడించారు. మరో పది మంది 10,812లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

గురజాలకు పలువురి శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్జీవో సంఘం నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 13: ఎమ్మెల్యేగా గెలుపొంది తొలి సారి చిత్తూరుకు వచ్చిన గురజాల జగన్మోహన్‌ను గురువారం పలువురు ప్రముఖులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని బీవీ రెడ్డి కాలనీలోని గురజాల నివాసంలో టు టౌన్ సీఐ ఉలసయ్య, వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఈస్ట్ సీఐ కుల్లాయప్ప, దిశ విష్ణు రఘువీర్, తాలూకా స్టేషన్ ఎస్సై ఉమామహేశ్వర్, ఎన్ఆర్ పేట ఎస్సై వెంకటసుబ్బమ్మ, పీవీకేఎన్ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, జడ్పీ సీఈవో గ్లోరియా, ఇరిగేషన్ ఈఈ, ఏఈలు, ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు, కార్యదర్శి రఘు, నేతలు మహేష్, మురుగేషన్. ఏపీఎన్జీవో అనుబంధ సంస్థల్లో భాగమైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి రవీంద్రబాబు, సంయుక్త కార్యదర్శి ప్రతాప్‌తోపాటు పలు ఉద్యోగ సంఘాల నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల గౌరవవేతనం ఇవ్వాలని నిరసన


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

నగరి, జూన్13: ఎన్నికల విధులకు సంబంధించిన గౌరవ వేతనం చెల్లించాలని నగరి నియోజకవర్గ సెక్టార్లు, రూట్ ఆఫీసర్లు, ఎఫ్ఎస్‌టీ టీమ్ మెంబర్లు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎన్నికలు జరిగి నెలరోజులు కావస్తున్నా గౌరవవేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. నిబంధనల మేరకు తమకు రావాల్సిన వేతనం, టీఏ, డీఏలు తక్షణం చెల్లించాలని ఎన్నికల అధికారి, నగరి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిచారు. స్పందించిన తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి వెంటనే చెల్లించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు.

స్వీట్లు పంచుకున్న వృద్ధులు, దివ్యాంగులు

కల్లూరు, జూన్ 13: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే చంద్ర బాబు పింఛన్ల పెంపుపై సంతకం చేశారు. దీంతో పులిచెర్ల మండలంలోని దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్లంకివారిపల్లిలో వృద్ధులు స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్ అమలు, స్కిల్ సెన్సస్‌పై సంతకాలు చేయడం చరిత్రాత్మకమని తెలియజేశారు. చంద్రబాబు ఎప్పుడూ పేదల అభ్యున్నతికి కృషిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపినాయుడు, పార్థసారధి, గిరిబాబు, దేవ, సురేంద్ర, భాస్కర్, తేజ, కిషోర్, రవినాయుడు పాల్గొన్నారు.

బాబు సీఎం అయ్యాడని కాలినడకన తిరుమలకు..


తిరుమలకు వెళుతున్న గొబ్బిళ్లమిట్ట గ్రామస్తులు

పెనుమూరు, జూన్ 13: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాడని మండలంలోని గొబ్బిళ్లమిట్ట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురువారం తిరుమలకు కాలినడకన వెళ్లారు. బాలాజీనాయుడు, యుగంధర్, సుబ్రమణ్యం, విద్యాసాగర్, ప్రతాప్‌నాయుడు, దివాకర్, నాదముని, జనసేన నాయకులు రాజు, జ్ఞాన గ్రామంలోని ఆలయంలో పూజలు చేసి, తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

గుండెపోటుతో యువకుడి మృతి


పవన్‌కుమార్ (ఫైల్ ఫొటో)

పెనుమూరు, జూన్ 13: మండలంలోని చార్వాగానిపల్లి గ్రామానికి చెందిన అనిత, ఈశ్వర్‌రావు కుమారుడు పవన్‌కుమార్(24) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. అతనికి ఏడాది క్రితం వివాహమైంది. నెల పాప ఉంది.

పవన్‌ను కలిసిన యుగంధర్



వెదురుకుప్పం, జూన్ 13: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆ పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న గురువారం విజయవాడలో కలిశా రు. నియోజకవర్గ పరిస్థితిని వివరిం చామని చెప్పారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం


హరికథను వినిపిస్తున్న భాగవతారిణి భారతి

కల్లూరు, జూన్ 13: పులిచెర్ల మండల కేంద్రంలోని మహాభారత యజ్ఞం ప్రాంగణంలో గురువారం మహాభారతం ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ముందుగా ద్రౌపది ధర్మరాజుల ఆలయంలో గురువారం వేకువజామున భక్తిశ్రద్ధలతో గెరిగపూజ నిర్వహిం చారు. ఉదయం 9 గంటలకు ధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో భాగవతారిణి భారతి మొదటిరోజు సర్పయాగం హరికథను భక్తులకు వినిపించారు. ఈ నెల 16 నుంచి రాత్రి వీధినాటకం ప్రారంభమవుతుందని, ఈ నెల 30 వరకు మధ్యాహ్నం హరికథ, రాత్రి వీధినాటకం ఉంటుందని నిర్వాహకులు తెలియ జేశారు.

బాటగంగమ్మకు పూజలు

రొంపిచెర్ల, జూన్13: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ మేళ్లయ్యగారి పల్లెలో ఈ నెల 13వ తేదీ నుంచి 17 వరకు బాటగంగమ్మ తిరుణాల జరుగుతోందని గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం, దుర్గహోమం, పూర్ణాహుతి, కలశాభిషేకం, ధ్వజారోహణం, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా గంగమ్మ జలధి వాసం


కోలాహలంగా అమ్మవారి ఊరేగింపు

సోమల, జూన్ 13: సోమలలో గంగ జాతర వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి 12 గంటలకు అమ్మవారి జలాధివాస కార్యక్రమం కోలాహలంగా సాగింది. స్థానిక శివాలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. అడు సుపల్లె సమీపంలోని చెరువు వద్దకు తీసు కెళ్లడంతో మార్గమధ్యంలోని దళితవాడ, అడుసు పల్లె, బుంగావారిపల్లె, గుంత చెరువు పల్లె గ్రామాల ప్రజలు మంగళ హారతులు సమర్పించారు. చెరువు వద్ద ఆసాదివారు అమ్మ వారికి పూజలు జరిపి శాస్త్రోక్తంగా జలాధివాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, చెన్నరాయప్ప, సుధాకర్, జగన్‌మోహన్, నాగరాజ, సురేంద్ర పాల్గొన్నారు.


గంగమ్మకు కల్లు తీసుకెళుతున్న భక్తులు

గెలిపించిన ప్రజలకు న్యాయం చేయలేకపోయా..

సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ ఆవేదన

పెనుమూరు, జూన్ 13: 'ప్రజలకు ఏదైనా మంచి చేయాలని రెండున్నరేళ్ల క్రితం సర్పంచ్‌గా నిలిచి గెలిచాను. గెలిపించిన ప్రజలకు మంచి చేయాలనే కల నెరవేరలేదు' ఇదీ మండలంలోని నంజరపల్లి సర్పంచ్ ఊహ ఆవేదన. గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు, మెజారిటీ సర్పంచులు వైసీపీ వాళ్లే కావడంతో శాఖలపై పెద్దగా నోరు తెరిచి మాట్లాడలేకపోయారు. ఊహ మైక్ తీసుకుని చాలా మీటింగుల్లో తన పంచాయతీకి నిధులు ఇవ్వాలని అడిగినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పంచాయతీ ఖాతాల్లో ఉన్న నిధులు కూడా ప్రభుత్వం తనకు తెలియకుండా వెనక్కు తీసుకుందని, అందువల్లే తనను గెలిపించిన ప్రజలకు న్యాయం చేయలేకపోయానని వాపోయారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం కొలువైందని, చంద్రబాబునాయుడు పాలనలో సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు చేరవేసి మంచి పాలన అందిద్దామని సభ్యులకు, అధికారులకు సూచించారు. ఇంతలో రామకృష్ణాపురం సర్పంచ్ ఎక్సైజ్ శాఖ అధికారితో మాట్లాడుతూ ఇన్నాళ్ల నాసిరకం మద్యంతో ప్రజలతో ఆడుకున్నారని, ఇప్పుడైనా కంపెనీ బ్రాండ్స్ ఇస్తారా అని అడగ్గా తమకు ఇంకా ఎటువంటి సమాచారమూ రాలేదని బదులిచ్చాడు. ఎంపీపీ హేమలత, జడ్పీటీసీ దొరస్వామి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దారు సుభద్ర, ఏఈలు పవన్, శశిభూషణ్‌రెడ్డి, ఈవోఆర్డీ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఊహ